క్లుప్తంగా

వసతి గృహాన్ని పరిశీలించిన న్యాయమూర్తి



చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలోని పోలాటితిప్పలో ఉన్న బీసీ సంక్షేమశాఖ బాలుర వసతి గృహాన్ని మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య పరిశీలించారు. వసతి గృహంలో ఎంత మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు, వారికి మెనూ ప్రకారం ఆహార పదార్థాలను అందజేస్తున్నారా, లేదా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో విద్యార్థులతో మాట్లాడి ఏ విధంగా చదువుతున్నారో ఆరా తీశారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారో లేదో అధికారుల సమక్షంలో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల స్లిప్పులు పంపిణీకి రంగం సిద్ధం



పెడన: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27న పోలింగ్ ప్రక్రియలో ఓటర్లు ఓటు వేసేందుకు వీలుగా ఓటు హక్కు కలిగిన ఓటరు సీరియల్ నంబరుతో పేరున్న స్లిప్పులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వ అధికారులు రంగం సిద్ధం చేశారు. పెడన మండలంలోని 1,390 మంది ఓటర్లకు సంబంధించిన స్లిప్పులను ఆయా సచివాలయాల వారీగా వేరు చేసి బీఎల్వోలకు, వీఆర్వోలకు పంపించేలా చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియను స్టార్ట్ చేసి 26వ తేదీలోగా ప్రతి ఓటరుకు స్లిప్పులను అందించాలని ఆదేశించినట్లు ఇన్చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 9 సచివాలయాలు, మండలంలోని 17 గ్రామ సచివాలయాలకు సంబంధించి స్లిప్పులు వీఆర్వోలు, బీఎల్‌వోలు తీసుకుని అందజేస్తారని ఆయన తెలిపారు.

నేడు ధ్యాన శివుని విగ్రహావిష్కరణ



మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ముఖద్వారంపై నూతనంగా ఏర్పాటు చేసిన ధ్యాన శివుని విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 19వ తేదీ ఉదయం 11.15 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ మత్తేవి రవికాంత్ మంగళవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచన, పంచగవ్య ప్రాశన, మంటప దేవతారాధన, స్వామి వారికి వివిధ రకాల ద్రవ్యాలతో రుద్రాభిషేకం, రుద్ర హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని రవికాంత్ కోరారు.

కోసూరివారిపాలెంలో రేషన్ పంపిణీ



కోసూరువారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో ఇటీవల విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన రేషన్ షాపులో నిలిచిపోయిన రేషన్ బియ్యాన్ని గడువు ముగుస్తుండగా జిల్లా పౌరసరఫరాల అధికారి వి.పార్వతి చొరవతో చివరి గంటలో పంపిణీ చేశారు. గడువు ముగుస్తుందని రెవెన్యూ అధికారులు రాత్రి సుమారు 7.30 గంటలకు తెలియజేయడంతో ఆమె కింద స్థాయి అధికారులను అలెర్ట్ చేసి ఒక గంటలోనే రాత్రి 8 నుంచి 9 గంటల సమయంలో 200 మంది లబ్ధిదారులకు రేషన్ బియ్యం, సరుకులు అందజేశారు. కోసూరువారిపాలెం, కె. కొత్తపాలెం, పెదకళ్లేపల్లి, మోపిదేవి 1,2,3 ఎండీయూలు అందరూ కలసి గ్రామంలో వీధివీధిలో తిరిగి సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సివిల్ సప్లయ్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

అనధికార లేఅవుట్లతో ఆదాయానికి గండి

- మున్సిపల్ అధికారుల హెచ్చరికలు బేఖాతరు
- క్రమబద్ధీకరణకు కూటమి నేతల యత్నం
- రాత్రికి రాత్రే వెలుస్తున్న వెంచర్లు
- భూముల ధరలకు అమాంతం రెక్కలు



గుడివాడ రోడ్డులోని వ్యవసాయభూమిలో రాత్రికి రాత్రే మట్టి తోలి రాళ్లు పాతిన వైనం

పెడన: పట్టణంలో అనధికార లే అవుట్లు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఈ అనధికార లే అవుట్ల కారణంగా మున్సిపాలిటీకి రావాల్సిన దాదాపు రూ.5 కోట్ల ఆదాయానికి గండి పడుతోంది. పట్టణంలో మున్సిపల్ అధికారులు గుర్తించిన అనధికార లే అవుట్లకు సంబంధించి 43 మంది జాబితాను సిద్ధం చేసి మున్సిపల్ కార్యాలయం ముందు ఫ్లెక్సీ కట్టించి వేలాడదీశారు. అందులో సర్వే నంబర్లు, సంబంధిత భూ యజమానుల పేర్లు కూడా నమోదు చేశారు. అయితే ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి దీనిని తొలగించాలని వాదిస్తోంది. ఇప్పుడు తాజాగా ఈ అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించే దిశగా ఎన్డీయే కూటమిలోని పాలకులు పావులు కదుపుతున్నట్లు సమాచారం లీకు కావడంతో మరింత మంది రాత్రికి రాత్రే వెంచర్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. సెలవు దినాల్లో సైతం వెంచర్లు వేసేస్తూ పాత వాటి కింద చూపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. బందరు పోర్టు, 216 జాతీయ రహదారి ఉండటంతో పాటు ఈ రహదారి నాలుగు లైన్లు రహదారి కానుండడంతో కొనుగోలుదారులు అనుమతులతో పని లేకుండా ఎగబడి మరీ కొనుగోలు చేసేస్తున్నారు. కొనుగోలు చేసిన తరువాత వాటికి సంబంధించిన అనుమతులు తెచ్చుకోవచ్చుననే ధీమా వ్యక్తం చేస్తుండటం గమనార్హం. రిజిస్ట్రేషన్ శాఖ సైతం ఇది వ్యవసాయభూమి నుంచి వ్యవసాయేతర భూమిగా మార్పు చెందిందా, మున్సిపల్ అనుమతులు ఉన్నాయా లేవా అనేవీ ఏవీ పట్టించుకోకుండా లింకు డాక్యుమెంట్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేస్తుండటం గమనార్హం.

కఠినంగా వ్యవహరిస్తాం



అనధికార లే అవుట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. ఇప్పటికే 43 ఉన్నట్లు గుర్తించాం. కొత్తగా ఒకటి, రెండు వెలిసినట్లుగా ప్లానింగ్ కార్యదర్శులు సమాచారం ఇచ్చారు. వాటిపై కూడా చర్యలు తీసుకుంటాం. మొత్తం ఎక్కడెక్కడ అనధికార లే అవుట్లు ఉన్నాయో వాటి వద్ద ఎటువంటి క్రయ విక్రయాలు జరపకూడదని, కొనుగోలు చేస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తాం. బోర్డులు పెట్టినా వాటిని తొలగిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– బి.సుజనకుమారి, టౌన్ ప్లానింగ్ అధికారి, పెడన మున్సిపాలిటీ

నూతన విద్యా విధానానికి అనుగుణంగా పనిచేయాలి



గూడూరు హైస్కూలులో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో అంగన్‌వాడీ కార్యకర్తలు

గూడూరు: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యావిధానానికి అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని డీవైఈఓ బి.ఎస్.సి.శేఖర్‌సింగ్ కోరారు. 120 రోజుల శిక్షణ తరగతులలో భాగంగా గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరురోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. విద్యాశాఖ, శిశుసంక్షేమ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ తరగతులను ఉద్దేశించి డీవైఈఓ మాట్లాడుతూ 2020లో కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసిన నూతన విద్యా విధానంలో భాగంగా క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అవగాహన కోసమే ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యు.ఉషశ్రీ, జన్ను రేవతి, రిసోర్స్ పర్సన్లు బషీర్, శ్రీనివాసరావు, రవి, మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్టి మెదడుకు పదును పెడదాం

సీడీపీవో సముద్రవేణి



సంగమూడి హైస్కూల్‌లో జరుగుతున్న శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీవో సముద్రవేణి

కృత్తివెన్ను: చిరుప్రాయంలో చిన్నారుల మెదడు ఎంతో చురుకుగా ఉండటమే కాకుండా మనం చెప్పిన ప్రతి విషయాన్ని చక్కగా గుర్తుంచుకోగలదని అటువంటి చిన్నారుల మెదడుకు మరింత పదును పెట్టి, చక్కని తెలివిని అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి అన్నారు. సంగమూడి ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా శిక్షణ జరిగింది. ఎంఈవో ఎస్‌కేడీవీ ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడేళ్ల కాలంలో ఏడాదికి 40 రోజుల వంతున 120 రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆరు రోజుల పాటు సంగమూడిలో ఈ కార్యక్రమం జరగనున్నట్లు హెచ్‌ఎం పి.పద్మజారాణి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు,డీఆర్‌పీలు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



ఎడ్లంకలో శివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

అవనిగడ్డ: మండల పరిధిలోని పాత ఎడ్లంకలో ఈనెల 26వ తేదీన జరగనున్న మహాశివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శివరాత్రి సందర్భంగా చేపట్టాల్సిన చర్యల గురించి పోలీస్, పంచాయతీ అధికారులతో సమీక్షించారు. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎడ్లంక ప్రాంతంలో పర్యటించి పలు సూచనలు చేశారు. సమావేశంలో పలు శాఖల అధికారులు, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

సమగ్ర శిక్ష ఏపీవో ఫణిధూర్జటి

పెడన: అంగన్‌వాడీల్లో చిన్నారుల ఆరోగ్యంపై ఎల్లప్పుడూ దృష్టి సారించడమే కాకుండా వారి నడవడికపై కూడా దృష్టి పెట్టి నలతగా ఉన్నారేమో గమనించాలని సమగ్ర శిక్ష జిల్లా ఇన్‌చార్జి ఏపీవో ఫణిధూర్జటి అన్నారు. పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు ఇచ్చే జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. శిక్షణ తీరుతెన్నులను పరిశీలించిన ఆయన అంగన్‌వాడీలకు పలు సూచనలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఎవరికైనా కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో సందేహాలుంటే నివృత్తి చేయడమే కాకుండా వాటిని వారికి అందించేలా నడుచుకోవాలని స్పష్టం చేశారు. చిన్నారుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఎం.సముద్రవేణి, ఎంఈవో-1 ఎంవీఎస్ దుర్గాప్రసాద్, ఎంఈవో-2 వైవీ హరనాథ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పి.కల్పవల్లి, కె.శ్రావణకుమారి, రిసోర్స్ పర్సన్స్ శ్రీమన్నారాయణ, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అచలేశ్వర ప్రతిష్ఠా మహోత్సవాలు

చల్లపల్లి: చల్లపల్లి మండల పరిధిలోని పాగోలు గ్రామంలో శ్రీకైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ ఆశ్రమంలో నిర్వహిస్తున్న శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వర ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసాగర్ గురూజీ పర్యవేక్షణలో వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, వడ్లమాని కేదారశర్మల ఆధ్వర్యంలో బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన పూజా కార్యక్రమాల్లో ట్రస్టీ మేకా సత్యనారాయణ ప్రసాద్(బంగారుబాబు), వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.బుధవారం రుద్రహోమం, శ్రీచక్ర నవార్చన తదితర పూజలు జరుగుతాయి.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

మోపిదేవి: చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారంతో కూడిన శారీరక, మానసిక, ఆటల ద్వారా బోధన అందించాలని ఎంఈవో-2, కోర్సు డైరెక్టర్ అన్నపరెడ్డి పిచ్చయ్య సూచించారు. మండల కేంద్రం మోపిదేవి జెడ్పీపాఠశాలలో మంగళవారం పాఠశాల విద్యాశాఖ, స్త్రీ, శిశుసంక్షేమశాఖ సంయుక్తంగా సాల్ట్ అనే కార్యక్రమంలో భాగంగా జ్ఞానజ్యోతి కింద మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. 120 రోజుల పోగ్రాంలో భాగంగా మొదటి స్పెల్‌లో ఈనెల 18,19,20 తేదీలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ట్రైనర్లు పి.సురేష్, బి.గౌతమ్ అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. సీడీపీవో శేషుకుమారి, పాఠశాల హెచ్‌ఎం పి.జయంతి, సూపర్‌వైజర్ రత్నమాల పర్యవేక్షణలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా

- ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కారం
- పీఎం సూర్యఘర్ స్కీం ద్వారా నగరంలో 2,261 మంది ఎస్సీలకు ఉచిత సేవలు
- విద్యుత్‌శాఖ మచిలీపట్నం నగర ఏడీఈ శ్రీనివాసులు



విద్యుత్ టౌన్ ఏడీఈ శ్రీనివాసులు

మచిలీపట్నంటౌన్: రానున్న వేసవిలో పెరిగే విద్యుత్ వినియోగ డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని విద్యుత్‌శాఖ మచిలీపట్నం నగర ఏడీఈ ఎం.శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ శాఖ ద్వారా వినియోగదారులకు అందిస్తున్న పలు సేవలను ఆయన 'సాక్షి'కి వివరించారు. ఈ వేసవిలో వినియోగదారులకు నిరంతర విద్యుత్‌ను అందించేందుకు నగరంలోని 12 ప్రాంతాల్లో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లను మార్చి నెలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటి ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. నగరంలో 8 విద్యుత్ సబ్ స్టేషన్‌లు, 33/11 కేవీ స్టేషన్‌లు ఉన్నాయన్నారు. బైపాస్‌రోడ్ నుంచి హౌసింగ్ బోర్డులో ఉన్న విద్యుత్‌లైన్‌పై ఓవర్‌లోడ్ పడుతోందని దీన్ని నివారించేందుకు అర కిలో మీటరు మేర నూతన విద్యుత్‌లైన్‌ను ఏర్పాటు చేసి హౌసింగ్‌బోర్డు ఫీడర్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ఈ పనులను మార్చి నెలాఖరులోపు పూర్తి చేస్తామన్నారు. నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను బిగించామన్నారు. రెండో విడతగా 3,011 కమర్షియల్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను త్వరలోనే బిగిస్తామన్నారు. ఈ స్మార్ట్ మీటర్లకు ప్రతి నెలా 1వ తేదీనే బిల్ జనరేట్ అయి ఫోన్‌కు వస్తుందన్నారు. ఈ బిల్‌ను ఆన్‌లైన్‌లో లేదా యూపీఐల ద్వారా చెల్లించవచ్చునన్నారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా నగరంలోని 2261 మంది ఎస్సీలకు ఉచితంగా యూనిట్లను బిగించనున్నట్లు తెలిపారు.

దీనికి సంబంధించిన డీపీఆర్‌ను కేంద్రప్రభుత్వానికి పంపామని అనుమతులు రాగానే యూనిట్‌ను గ్రౌండ్ చేస్తామన్నారు. దీని ద్వారా ఎస్సీల గృహాలకు అమర్చే 1 కిలోవాట్ యూనిట్‌తో నెలకు 360 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించే వీలు కలుగుతుందన్నారు. ఇక సాధారణ వ్యక్తులకు ఈ పథకం ద్వారా దాదాపు రూ.78 వేల సబ్సిడీ, 1.90 లక్షల బ్యాంక్ రుణంతో యూనిట్‌ను ఇస్తారన్నారు. నగరంలో ఇప్పటి వరకూ 2862 దరఖాస్తులు రాగా వీటిలో 125 యూనిట్‌లను బిగించినట్లు తెలిపారు. బ్యాంక్ రుణాలను ప్రతి నెలా వాయిదా పద్ధతిన చెల్లించే వీలుందన్నారు. ఈ పథకంతో విద్యుత్ వినియోగదారులు అమ్మకందారులుగా మారతారన్నారు. వారి గృహాల్లో తయారయ్యే విద్యుత్‌ను వినియోగించుకోగా మిగిలినదానిని యూనిట్‌కు రూ.2.09 చెల్లించి తమ సంస్థ కొనుగోలు చేస్తుందన్నారు. ఈ పథం అమలుకు రిజిస్ట్రేషన్ల కోసం నగరంలో మూడు బృందాలు పర్యటిస్తున్నాయన్నారు. విద్యుత్ సంబంధ సమస్యలు ఉంటే తన సెల్‌ఫోన్ నంబర్ 94408 12104 కు ఫిర్యాదు చేయవచ్చునని ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మచిలీపట్నంటౌన్: ఏఐటీయూసీ అనుబంధ మచిలీపట్నం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కరపాటి సత్యనారాయణ కార్మికవర్గానికి చేసిన సేవలు మరువరానివని మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. సత్యన్నారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక పరాసుపేటలోని ఆర్సీఎం వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సత్యన్నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు నగర సంకీర్తన

పెడన: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం పట్టణంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు హిందూ బంధువుల ఐక్యవేదిక పెడన శాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు పెడన బస్టాండు సెంటరులోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానం నుంచి నగర సంకీర్తన బయలుదేరి పెద్ద దేవుడి గుడి శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం వరకు వెళుతుందని తెలిపింది. అనంతరం శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామిజీ ప్రవచనం, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని ఐక్యవేదిక పేర్కొంది. భక్తులు పాల్గొని ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తిచేసింది.

22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెడన: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి తప్పక హాజరు కావలసిందిగా కోరారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించండి

కలెక్టర్ బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): నగర పరిధిలో ప్రతి డివిజన్‌లో తడి, పొడి చెత్తను తప్పనిసరిగా వేరువేరుగా సేకరించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం సాయంత్రం పారిశుద్ధ్య నిర్వహణపై నియమించిన ప్రత్యేక అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి నగర సుందరీకరణకు కృషి చేయాలన్నారు. టీ కొట్లు, ఇతర షాపుల వద్ద చెత్తబుట్టలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుబజారు వద్ద ఎక్కడ పడితే అక్కడ చెత్తను పడేయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణపై నగరంలోని ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలన్నారు. తరచుగా చెత్త వేసే ప్రదేశాలు గుర్తించి అక్కడ మరల చెత్త వేయకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ డెప్యూటీ సీఈవో ఆనందకుమార్, పశుసంవర్ధకశాఖ అధికారి చిన నరసింహులు, గిరిజన సంక్షేమాధికారి ఫణిధూర్జటి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి వి.రమేష్, మార్కెటింగ్ శాఖ ఏడీ ఎల్.నిత్యానందం, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన పోస్టల్ సూపరింటెండెంట్



కలెక్టర్ డీకే బాలాజీకి మొక్కను అందజేస్తున్న శ్రీనివాసరావు



ఎస్పీ గంగాధరరావుకు మొక్కను అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

చిలకలపూడి/కోనేరుసెంటర్(మచిలీపట్నం): మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు మంగళవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావులను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. శ్రీనివాసరావు గుజరాత్ సర్కిల్‌లోని వడోదర డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ మచిలీపట్నం సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

విద్యార్థులు తప్పుదోవను ఎంచుకోవద్దు

లోక్ అదాలత్ జడ్జి రామకృష్ణయ్య



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణయ్య

పెడన: విద్యార్థులు సన్మార్గంలో నడుచుకోవాలని, తప్పుదోవను ఎంచుకోవద్దని, తప్పుదోవన నడిస్తే భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేస్తోందని లోక్ అదాలత్ జడ్జి యూవీ రామకృష్ణయ్య అన్నారు. మండలంలోని నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా మోటార్ చట్టాలు, సాంఘిక చట్టాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్జి రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి పోవద్దన్నారు. డ్రగ్స్, మద్యం, ట్రిపుల్ డ్రైవింగ్ కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. జిల్లా రవాణా అధికారి బీఎస్ శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ అతి వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేని డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, స్పోర్ట్స్ బైక్స్‌తో సాధారణ రోడ్లపై డ్రైవింగ్, ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా డ్రైవ్ చేయడం నేరమన్నారు. వీటిపై విద్యార్థులు పూర్తి అవగాహన పెంచుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె.నారాయణ స్వామి, సీనియర్ న్యాయవాది సీహెచ్ ముసలయ్య, కళాశాల చైర్మన్ జీఎం ప్రసాద్, కరెస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.బాబా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు, మెడల్స్ పొందిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ


మచిలీపట్నంటౌన్: విజయవాడ ప్రసాదంపాడులోని వివేకానంద పాఠశాలలో ఇటీవల నిర్వహించిన వేదిక్ మాథ్స్, అబాకస్ ప్రతిభా పోటీల్లో స్థానిక జవ్వారుపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా మంగళవారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మేకా సత్యనారాయణ వారిని అభినందించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన అబాకస్ జూనియర్ విభాగంలో 4వ తరగతి విద్యార్థి సయ్యద్ సిద్రా ద్వితీయ బహుమతి, సీనియర్స్ విభాగంలో జె.అక్షితవల్లి ప్రోత్సాహక బహుమతిని పొందారు. వేదిక్ మాథ్స్ పరీక్షలో పి.థోని, సీహెచ్ అరుణ్‌కుమార్, వై.లోకేష్, పైడిపాముల రుత్విక్, వి.సునీత బహుమతులు పొందినట్టు హెచ్‌ఎం సత్యనారాయణ తెలిపారు.

తెలుగురావుపాలెంలో సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన సర్పంచ్

ఘంటసాల: గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి మంగళవారం అర్జీ సమర్పించారు. ఘంటసాల గ్రామంలో కిసాన్ మేళాలో పాల్గొనడానికి వచ్చిన కలెక్టర్‌కు తెలుగురావుపాలెంలో ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమి కోర్టు కేసులో ఉందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఘంటసాల గ్రామంలోని జగనన్న కాలనీలో బిల్డింగ్‌పై రేకుల షెడ్డు వేసుకోవడంతో రూ.3000 పైనే పంచాయతీ వారు ఇంటి పన్ను వేస్తున్నారని గ్రామానికి చెందిన పూర్ణ, సుధాకరరావు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్ ఇంటిపన్ను సమస్యను ఎంపీడీవో సుబ్బారావుకు చెప్పి పరిష్కరించాలని, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం తెలుగురావుపాలెం రైతు సేవా కేంద్రంలో రెగ్యులర్ వీఏఏను నియమించాలని కోరుతూ సర్పంచ్ ప్రసాద్‌బాబు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.పద్మావతికి వినతిపత్రం అందించగా త్వరలోనే నియమించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

హాకీ అసోసియేషన్ ఏపీ సంయుక్త కార్యదర్శిగా శ్రవణం రామకృష్ణ



మచిలీపట్నంఅర్బన్: ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా మచిలీపట్నానికి చెందిన సీనియర్ నేషనల్ హాకీ క్రీడాకారుడు శ్రవణం రామకృష్ణ పరమహంసను నియమించినట్లు రాష్ట్ర హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు బీఎం చాణక్య రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణ హాకీ కృష్ణాజిల్లా అసోసియేషన్‌కు రెండుసార్లు ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర అసోసియేషన్‌లో ఎగ్జిక్యూటివ్ మెంబరుగా, జాయింట్ సెక్రటరీగా సేవలు అందించారు. ప్రస్తుతం హాకీ కృష్ణాజిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో హాకీ అభివృద్ధికి రామకృష్ణ విశేషంగా కృషి చేశారు. మచిలీపట్నంలో మూడుసార్లు రాష్ట్రస్థాయి, అనేక సార్లు జిల్లాస్థాయి పోటీలు, వేసవి ఉచిత హాకీ శిక్షణ శిబిరాలు నిర్వహించి జాతీయ క్రీడ హాకీను ప్రాచుర్యంలోనికి తీసుకువచ్చారు. ఆయన ఎంపిక పట్ల హాకీ కృష్ణాజిల్లా అసోసియేషన్ సభ్యులు, మచిలీపట్నానికి చెందిన పలువురు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.